


లారీలను అధికంగా పంపిస్తాం


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 08 నవంబరు , 2025 | పేజీలు : 06


## మునుగోడు నియోజకవర్గంలోనే

# పత్తికి అత్యధిక నష్టం

### పత్తి రైతులను ఆదుకోవాలి
### జిల్లా కలెక్టర్‌ను కోరిన
### ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ ప్రభావంతో మునుగోడు నియోజకవర్గంలోనే అత్యధికంగా పత్తి నష్టం జరిగిందని,రైతులు పత్తితీత దశలో ఆకార వర్షాలు కురవడం తీవ్ర నష్టాన్ని చేకూర్చడం దురదృష్టకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. వర్షానికి తడవగా మిగిలిన పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలని,నియోజకవర్గ వ్యాప్తంగా సిసిఐ కొనుగోలు కేంద్రాలను కూడా పెంచేలా చర్యలు తీసుకోవాలని శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నుండి ఆయన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని ఫోన్‌లో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమశాతం సాకుతో సిసిఐ అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సిసిఐ రిజెక్ట్ చేసిన పత్తిని దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే పత్తిని సిసిఐకి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు.రైతులు తీసుకెళ్తే కొనని పత్తిని దళారులు తీసుకెళ్తే సిసిఐ అధికారులు కొనుగోలు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని ఈ విషయంలో దళారులను నియంత్రించడంతోపాటు సిసిఐ అధికారులు నేరుగా రైతుల పత్తిని కొనుగోలు చేసుకునే విధంగా చూడాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలో అత్యధికంగా పత్తిని పండిస్తున్నారని ఈ అకాల వర్షాల వల్ల 50 శాతానికి పైగా పత్తి దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల పత్తి పంట దిగుబడి తగ్గిందని సాకు చూపిస్తూ 12 క్వింటాల నుండి 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారంటూ స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఈ విషయంపై కూడా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో మాట్లాడి వీలైనంత తొందరగా సిసిఐ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.లైసెన్సు లేకుండా దళారులు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేస్తున్నారంటూమండలంలో దళారులు ఎంతమంది పత్తి కొనుగోలు చేస్తున్నారోవారి జాబితాను సిద్ధం చేయాలని ఆయన పోలీసులను ఆదేశించారు.

# కుట్ర కోణంతోనే మున్సిపల్ చోరీ

### చోరీ విషయాలను ప్రజలకు బహిర్గతం చేయాలి : సిపిఐ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదగిరిగుట్ట భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కి చోరీ కుట్ర కోణంతోనే జరిగిందని చోరీకి సంబంధించిన విషయాలు బహిరంగంగా ప్రజలకు తెలియజేయాలని కోరుతూ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పేరబోయిన మహేందర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ బుధవారం యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో జరిగిన దొంగతనానికి సంబంధించి మున్సిపల్ కార్యాలయం పరిశీలించి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. అక్కడ పరిస్థితులు చూస్తుంటే కార్యాలయంలో సంబంధించి చోరీకి ప్రయత్నించిన వాళ్లు కుట్రకోణంతోనే చేసిన విధంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. యాదగిరిగుట్ట పట్టణ ప్రజలు కూడా చోరీ పట్ల అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రతి వస్తువు ప్రజలు టాక్స్ ద్వారా చెల్లించిన రూపాయల ద్వారా కొనుగోలు చేసింది కాబట్టి రికార్డులకు సంబంధించిన విషయాలు జరిగిన నష్టం విషయాలు పట్ల చోరీకి సంబంధించిన ప్రతి విషయాన్ని ప్రజలకు బహిరంగంగానే మున్సిపల్ కమిషనర్ తెలియజేయాలని డిమాండ్ చేశారు.

**సిసి రోడ్లను తక్షణమే ప్యాచ్ పని చేయాలి**

యాదగిరిగుట్ట పట్టణంలో అమృత్ కింద వేసే పైప్ లైన్ పూర్తిగా అనుసారంగా వేస్తున్నారని పైపు లైన్లు వేయడానికి అవకాశం ఉన్న సిసి రోడ్లు బ్రేక్ చేయడం జరుగుతుందన్నారు. దానివలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని ఎక్కడైతే సిసి రోడ్డు బ్రేక్ చేశారో అక్కడ తక్షణమే సీసీ ప్యాచ్ వర్కు చేయాలని కోరారు. గతంలో మిషన్ భగీరథ సమయంలో కూడా ఈ రకంగా సిసి రోడ్లు బ్రేక్ చేసి ప్యాచ్ వర్క్ చేస్తామని చెప్పి చేయలేదని తెలిపారు. ఇప్పుడు కూడా అదే రకంగా జరిగే అవకాశం ఉందని ఈ పైప్ లైన్ కోసం చేసిన సీసీ ప్లేట్ల వలన పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణం సీసీ ప్యాచ్ వర్క్‌లను చేయాలన్నారు. అలాగే మూడు పీట్ల లోతుల వేయవలసిన పైప్ లైన్లు కేవలం ఫిట్ నరా లోతుల్లోనే వేస్తున్నారని అధికారులు స్పందించి ప్రతి పైప్ లైన్ మూడు ఫీట్ల లోతులో వెయ్యాలన్నారు. పట్టణ ప్రాంతంలో కాకుండా పట్టణంకి దూరంగా ఉన్న ప్రవేశంలో ముందుగా పైప్‌లైన్ వేస్తున్నారని, మొదలుగా ప్రజలు నివాసమున్న ప్రాంతాలలో వేయాలని ఈ రెండు అంశాల పైన మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం ద్వారా తెలియజేశారు. మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పెంటయ్య, సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, ఏఐటి యుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, కార్యవర్గ సభ్యులు గోపగాని రాజు, పుష్ప, ఇస్తారి పాల్గొన్నారు.



## వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకుగా సాగాలని అదనపు కలెక్టర్ సీతారామారావు కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారుమూల పల్లెల్లోని యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు తెలంగాణ ప్రభుత్వం యువజన ఉత్సవాలకు శ్రీకారం చుట్టిందని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతోపాటు కళలు, కళాప్రదర్శనలు ఆటల్లో యువతను ప్రోత్సహిస్తోందని తెలిపారు. అందులో భాగంగా ఏడు కేటగిరిల్లో ప్రదర్శనలకు అవకాశం ఇస్తూ జిల్లాస్థాయి యువజన కళాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా, స్పోర్ట్స్ అధికారి వెంకట్‌రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యండి అంజద్‌అలీ, డిసిసి అధికారి ప్రతినిధి కుందామల్ల శేఖర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రెండో రోజూ కొనసాగుతున్న జిల్లా స్థాయి క్రీడలు

**ప్రజాపక్షం/నందికొండ:** స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గురువారం ప్రారంభమైన జిల్లా స్థాయి క్రీడలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. రెండో రోజూ కొనసాగిన క్రీడలలో గెలుపొందిన జట్ల వివరాలు అథ్లెటిక్స్ 200 మీటర్ల విభాగంలో నాగార్జునసాగర్ గురుకుల పాఠశాలకు చెందిన ఎం గణేష్ ప్రథమ బహుమతిని సాధించగా అనంతారం పాఠశాలకు చెందిన కే ఆనంద్ ద్వితీయ బహుమతిని సాధించగా పోచంపల్లి పాఠశాలకు చెందిన పవన్ తృతీయ బహుమతిని సాధించాడు. 800 మీటర్ల విభాగంలో అనంతారం పాఠశాలకు చెందిన బన్నీ వీకేషులు అర్థమ విజయ బహుమతిని సాధించగా నాగార్జునసాగర్ పాఠశాలకు చెందిన రంజిత్ తృతీయ బహుమతితో సరిపెట్టుకున్నాడు. డిస్కస్‌త్రో విభాగంలో అనంతారం పాఠశాలకు చెందిన అరవింద్ ప్రథమ బహుమతిని సాధించగా మునుగోడు పాఠశాలకు చెందిన వినయ్ వర్ధన్ ద్వితీయ బహుమతిని,చిలుకూరు పాఠశాలకు చెందిన అభిరామ్ తృతీయ బహుమతిని సాధించారు.ఖోఖో విభాగంలో అనంతారం, నాగార్జునసాగర్ జట్లు సెమీఫైనల్ కు చేరుకోగా కబడ్డీ విభాగంలో మూసీ కనగల్ నేరేడుచర్ల అనంతరం జట్లు సెమీఫైనల్ లోకి దూసుకెళ్లాయి. అండర్ 14,17,19 విభాగానికి సంబంధించి జరుగుతున్న క్రీడలు ఈ నెల 13 న ముగియనున్నాయి.





## రాష్ట్రస్థాయి క్విజ్‌లో తేజ విద్యాలయ విద్యార్థులు

**ప్రజాపక్షం/ కోదాడ :**హైద్రాబాద్ నగరం గోల్‌కొండ ఆర్మీ పబ్లిక్‌స్కూల్ లో శనివారం ఇంటాక్ సంస్థ వారు పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలో సూర్యపేట జిల్లా కోదాడ పట్టణ పరిధి కోమరబండ శివారులోని తేజ విద్యాలయం విద్యార్థులు వి.రిషిక(10వ తరగతి), గాయం రేఖశ్రీ(9వ తరగతి) జట్టు ఫైనల్ పోటీలో అద్భుత ప్రదర్శనతో ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీలో విజేతకలు హైద్రాబాద్ డిప్యూటి కలెక్టర్ కదిరావన్ పళని ట్రోఫిలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ తెలంగాణ ఛాప్టర్ నిర్వహాకులు అనురాధరెడ్డి, క్విజ్ మాస్టర్ ప్రవీణ్, నిర్వహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారులకు అన్నదానం



**ప్రజాపక్షం/ కోదాడ :** పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాయలం శనివారం దాతల సహకారంతో ఆలయకమీటి వారు మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా దాత రంగాగాంధీ, రూపవతిల జ్ఞాపకార్థం కుమారుడు రంగా శ్రీనివాసరావు, ధర్మపత్ని ఆశాలతలు 40 కేజీల కారం, 10 కేజీల పసుపు, 10 కేజీల ధనియాల పౌడర్‌ను అందించారు. అనంతరం దాతలను ఆలయ కమీటి వారు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమీటి ప్రదాన కార్యదర్శి చల్లా రామూర్తి, ఉపాధ్యాక్షులు కొక్కు లక్ష్మి నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, సహయ కార్యదర్శి సురభి నర్సయ్య, పైడిమర్రి వెంకటనారాయణ, డైరెక్టర్లు, గురుస్వాములు పాల్గొన్నారు.

## ఘనంగా వందేమాతరం గేయాలాపన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వందేమాతరం గీతం రచించిన శుక్రవారం నాటికి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వందేమాతరం గేయాలాపన మిర్యాలగూడ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛంద సంస్థల కార్యాలయాల్లో వందేమాతరం గేయాలాపన చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవో శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో గేయాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కెఎన్ఎం1638 వరి గింజలను నాటుకోవాలి



**ప్రజాపక్షం/మునగాల:** రైతులు నాణ్యమైన వరి విత్తనాలు కెఎన్ఎం 1638 వరి గింజలను యాసంగి సీజన్‌లో నాటుకోవాలని విశ్వ విద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణబాబు, మునగాల మండల వ్యవసాయ అధికారి బుంగరాజు లు అన్నారు. రబీ సీజన్‌లో నాటిన రైతుల వరి పొలాలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ వారు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మండల పరిధిలోని గణపవరం, బరాఖత్‌గూడెం, మాదవరం గ్రామాల్లో వరిని నాటిన పొలాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెఎన్ఎం 1638 అనేరకం అగ్గి తెగులు, ఉల్లికొడు తట్టుకుని తక్కువ కాలపరిమితి అనగా 125 రోజులకే పంట చేతికి వచ్చి సన్నగింజ రకం అన్నం క్వాలిటిగా ఉండి సాంబ మసూరి లాగా ఉంటుందని, దీనికి కంకి గింజలు దాదాపు 250 గింజల నుండి 300 వరకు గింజలుంటాయని గమనించారు. సుమారు ఎకరాకు 40 నుండి 50 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రానున్న యాసంగి సీజన్‌లో ప్రతిఒక్క రైతు ఈ వరి వంగడాలను నాటి అధిక దిగుబడి సాధించాలని అన్నారు.ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు రణబోతు వీరారెడ్డి, శాకమూడి అరవిందు, చందా రాధకృష్ణ, దొంతిరెడ్డి మోహన్‌రెడ్డి, రణబోతు హరిష్‌రెడ్డి, కుందురు నర్సిరెడ్డి, రణబోతు రామిరెడ్డి, ప్రతాపనేని సతీష్ పాల్గొన్నారు.

# తడిసి, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల వేల ఎకరాల్లో కోతకు వచ్చిన పంట తడిసి ముద్దయిన సంగతి ప్రభుత్వానికి తెలిసినప్పటికీ రైతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, రైతులను రైస్ మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అప్పులు చేసి పంటలను సాగు చేసిన రైతులకు తుఫాన్ ప్రభావంతో చేతికందిన పంటకు నష్టం వాటిల్లిడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని అన్నారు. ధాన్యం రంగుమారిందన్న సాకుతో రైస్ మిల్లర్లు కొనగోలు చేయకపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని, అండగా నిలవాల్సిన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు నేటికి రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని అన్నారు. మిల్లర్ల చేత రంగుమారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మురళీయాదవ్, పున్నా రాములు, ఈశ్వరచారి, వెంకట్ పాల్గొన్నారు.




# పేద విద్యార్థులకు అండగా ఐఎంఏ సేవలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సంక్షేమ హాస్టల్లో ఉండే విద్యార్థులకు ఐఎంఏ అండగా ఉంటుందనీ సీనియర్ డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి ఐఎంఏ స్పోర్ట్స్ కల్చర్ చైర్మన్ డాక్టర్ పుల్లారావు అన్నారు.శుక్రవారం పట్టణంలోని ఎస్‌సిడిడి క్యాంపస్ లో విద్యార్థులకు 4 గ్రీజర్లు ఐఎంఏఆధ్వర్యంలో అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో చలి కాలం విద్యార్థులు స్నానానికి ఇబ్బంది పడకుండా గ్రీజర్లు అందజేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో పేద పిల్లలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుమన్నారు.కార్యక్రమంలో ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ మూర్తి,డాక్టర్ జి అనితా రాణి,డాక్టర్ రమేష్,విజయ్,ప్రవీణ్,జార్జ్ ప్రవీణ్,విజయలక్ష్మి, స్వప్న, సత్యవతి తదితరులు ఉన్నారు.



# తండాల్లో రేషన్ సబ్ సెంటర్ల ఏర్పాటు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి కిలోమీటర్ల దూరం ప్రయాణించే కష్టాన్ని గుర్తించి, సబ్ సెంటర్ ద్వారా గిరిజనుల సమస్యను పరిష్కరించారు జిల్లా కలెక్టర్ హనుమంత రావు. వివరాల్లోకి వెళితే జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తుర్కపల్లి మండలంలోని ములకలపల్లి రేషన్ షాపు నుండి ప్రతి నెల 2 కిలో మీటర్ల దూరం వెళ్లి రేషన్ బియ్యం తీసుకోవడం వల్ల తలెత్తే ఇబ్బందిని గుర్తించి జేతురంతండా, గొల్లగుడెం రేషన్ షాపు నుండి రామోజీ నాయక్ తండ గ్రామస్థుల కొరకు వారి తండాల్లోనే రేషన్ సబ్ సెంటర్‌లను ఏర్పాటు చేసి బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మార్వో దేశ్య తెలిపారు. ఈ సందర్భంగా రేషన్ సబ్ సెంటర్ ఏర్పాటు చేసినందుకు తండవాసులు జిల్లా కలెక్టర్‌కు, తహశీల్దార్ మండల అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.





## ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** సరైన తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం కేసారం గ్రామంలో డిఆర్‌డిఏ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు శ్రమించి పండించిన ప్రతి ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్‌రెడ్డి, లింగమంతుల స్వామి దేవస్థానం డైరెక్టర్లు మెంతబోయిన లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేఖ సతీష్, మల్లయ్య, బచ్చయ్య, చింత శ్రీను, చింత సైదులు పాల్గొన్నారు.

## స్పార్క్‌ఫెస్ట్‌లో మైనార్టీ గురుకుల విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లా మైనార్టీ గురుకులాల స్పార్క్ ఫెస్ట్‌లో హుజూర్‌నగర్ మైనార్టీ బాలికల గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ రెహనా శుక్రవారం తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 13 మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు నవంబర్ 6న నిర్వహించిన ఈ స్పార్క్‌ఫెస్ట్‌లో ఉర్దూలో వ్యాసరచన జూనియర్ విభాగంలో స య్యద్ అంజుమ్, హ్యాండ్ బాల్ క్రీడలో నూకపంగు ఆకాంక్ష రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు నిర్వహించే ఈ స్పార్క్ ఫెస్ట్‌లో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల కు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య క్రేందంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పెన్‌పహాడ్ మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటి ఆధ్వర్యంలో జిల్లా కమిటి పిలుపులో భాగంగా పెన్‌పహాడ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించాలని కోరారు. మందుల కొరతను నివారించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండమీది రాములు, రణపంగ కృష్ణ, గుర్రం గోపాల్‌రెడ్డి, రణపంగ బుచ్చిరాములు పాల్గొన్నారు.



## 9న ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి వాలీబాల్ సెలెక్షన్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఈనెల 9న సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సీనియర్ వాలీబాల్ సెలెక్షన్ జరుగుతుందని ఉమ్మడి నల్లగొండ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తెలంగాణ సీనియర్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి వాలీబాల్ చాంపియన్షిప్ కొరకు సెలెక్షన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకి జనన ధృవీకరణ పత్రంతో హాజరుకావాలని కోరారు.

## సైన్స్‌పై అవగాహన కోసం చెకుముకి పరీక్షలు



**ప్రజాపక్షం/ కోదాడ :**పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కలిగించాలనే లక్ష్యంతో జన విజ్ఞానవేదిక సారథ్యంలో చెకుముకి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని మండల విద్యాధికారి ఎం.డి సలీంషరీఫ్ అన్నారు. శనివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో చెకుముకి ప్రశ్నపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పోటీలో మండల స్థాయికి పాఠశాలకు చెందిన ఎస్‌కె తాయబ్, కె.షణ్ముఖ, టి.హర్షకుమార్ ఎంపికైనారు. ఇంచార్జి ఇర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల సందర్శన



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్, గుడిమల్కాపురం గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను మండల స్పెషల్ ఆఫీసర్ జయశ్రీ సందర్శించారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి కొనుగోలు తేమశాతం మద్దతు ధర చెల్లింపుల, తూకాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ మమత, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఆర్ఐ కట్ట పాండు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని మొర

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల స్వామి తండ్రి మల్లయ్య నిరుపేద కుటుంబం కావడంతో రెక్కాడితే కాని డొక్కాడని జీవితాలతో బతుకుతెరువు కోసం పట్నం బాట పట్టి కూలీ నాలీ చేసుకుంటు పొట్ట నింపుకుంటున్న ఆయనకు ఇటీవల మొంథా తుఫాను ప్రభావంతో గ్రామంలో ఉన్న తన ఇల్లు పూర్తి స్థాయిలో కూలీపోవడం జరిగింది. కూలీ చేసుకొని జీవనం సాగిస్తున్న తన కుటుంబానికి ప్రభుత్వం, స్థానిక ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య చొరవ తీసుకొని ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయాలని ఆయన వేడుకున్నారు.

## తాను చనిపోయినా మరొకరికి వెలుగు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని హైటెక్ సిటీ కాలనీకి చెందిన వైద్యం దయాకర్ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు,ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ నేతి రఘుపతిలయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ సభ్యులు దయాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారి అనుమతితో దయాకర్ నేత్రాలు సేకరించారు.దయాకర్ నిడమనూరు మండలం ధర్మారం పాఠశాలలో ఎస్‌జిటీగా విధులు నిర్వహిస్తున్నారు.దయాకర్ తాను మరణించినప్పటికీ మరొకరికి వెలుగునిచ్చారని ఆయనను గుర్తుచేసుకుంటూ బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.ఐ డొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 230 నేత్రదానాల ద్వారా 460 కంటి పొరలను సేకరించి వీటిద్వారా ఎంతో మంది కార్నియా అంధులకు కంటిచూపును అవకాశం కలిగిందని మేనేజర్ డాక్టర్ పుల్లారావు తెలిపారు.

## 9వ షెడ్యూల్లో చేర్చాలి




**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** బిసిలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికలలో 42రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంట్‌లో బిల్లును ఆమోదింపజేసి, రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బిసి జేఏసీ చైర్మన్ మునస ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని గడియారం సెంటర్లో బిసి జేఏసీ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బిసి జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ ఈనెల చివరలో జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో బిసి బిల్లును ఆమోదింపజేసి రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చాలని లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వంపై ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గండిచెరువు వెంకన్న గౌడ్, బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఐతగోని జనార్దన్ గౌడ్,ఎంఎ ఖదీర్,పుట్ట వెంకన్న గౌడ్, కర్నాటి యాదగిరి,చిలుకరాజు సతీష్, సతీష్ కుమా ర్, రామన్న గౌడ్, రాజు, భరద్వాజ పాల్గొన్నారు.

## భారతీయుల్లో స్ఫూర్తినింపిన జాతీయగేయం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భారత స్వాతంత్ర ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపి రణ నినాదంగా ఎంతగానో ఉపయోగపడిన గీతం వందేమాతరం అని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని వందేమాతరం గేయాన్ని కలెక్టరేట్‌లోని ఉద్యోగస్తులందరితో ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయానికి నేటితో 150 సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. బెంగాలీలో రచించిన ఈ గేయం బెంగాల్ విభజన అయిన తర్వాత వందేమాతరం ఇంకా ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి నరసింహ, గిరిజన సంక్షేమ అధికారి శంకర్, స్త్రీ శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ సివిల్ జడ్జికి పదోన్నతి



**ప్రజాపక్షం/ హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న రాధా కృష్ణ చౌహాన్‌కు సూర్యాపేట జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ హుజూర్‌నగర్ నుండి బదిలీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఇక నుండి సూర్యాపేట జిల్లా మొద టి అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహించడంతోపాటుగా హుజూర్‌నగర్ రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా అలాగే పోక్సో కోర్టు న్యాయమూర్తిగా కూడా అదనపు పూర్తి బాధ్యతలు స్వీకరించాలంటూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రమోషన్ రావడం పట్ల బార్ అసోసియేషన్ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## జానపద గాయకుడిగా భాస్కర్‌కు ప్రశంసా పత్రం

**ప్రజాపక్షం/చందంపేట;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అఖిల భారత సివిల్ సర్వీస్ రాష్ట్ర స్థాయి సంగీత, నృత్య, నాటక పోటీలు 2025/26లో భాగంగా ఈనెల 06, 07 తేదీలలో తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో జానపద గాయకుడు భాస్కర్ పులికంటి హెల్త్ అసిస్టెంట్ చందంపేట పిహెచ్‌సి శ్రోతలను అలరించి తన ప్రతిభను కనబరచగా అక్కడికి విచ్చేసిన ప్రముఖులు అభినందనలు తెలుపుతూ ప్రశంస పత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. ఈపోటీలో పాల్గొనుటకు నిత్యం ప్రోత్సహించిన హెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డా. రాజేష్, సిబ్బంది, కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు భాస్కర్ ధన్యవాదాలు తెలిపారు.





## నవీన్ యాదవ్ గెలుపుకు దేవరకొండ నేతల ప్రచారం

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలు నాయక్ నాయకత్వంలో ఓటర్లను కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం రెహమత్‌నగర్‌లో దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ప్రచారంలో పాల్గొన్ని ఓటర్లను ఓటు అభ్యర్థించారు. కాంగ్రెస్ గెలుపుతో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, దేవరకొండ మాజీ జెడ్పిటిసి అరుణ సురేష్‌గౌడ్, చింతపల్లి మాజీ ఎంపిపి భవాని పవన్‌కుమార్, జిల్లా నాయకులు గోపాల్‌రావు, రాజేష్, నాగభూషన్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** వర్షాలు తగ్గినందున 17 తేమ వచ్చే విధంగా రైతులు కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని బాగా ఆరబెట్టాలని తాహసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోల్లు కేంద్రాన్ని,మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. 17 తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తిసుకరావలన్నారు. రైతులకు ప్రభుత్వము అందించే మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి వేణుగోపాల చారి,ఎండిఓ జి సి. మున్నయ్య,ఏపిఎం వెంకటేష్,వ్యవసాయ విస్తరణ అధికారులు,మాల్ మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్ రెడ్డి,మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## పశువుకు టీకాలు వేయించాలి

**ప్రజాపక్షం/గుండాల;** రైతులు వారి పశువులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి డా. యాకుబ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రామారం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి సుమారు 159 పశువులకు టీకాలను వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు టీకాల విషయంలో ఎలాంటి అపోహలకు గురికావద్దని తెలిపారు. టీకాలు వేయించడం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉండడమే కాకుండా సంవృద్ధిగా పాలను ఉత్పత్తి చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ పాల సెంటర్ చైర్మన్ అండెం రాంరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ రాజు, గోపాలమిత్రలు గోవింద్ పాల్గొన్నారు.



# వందేమాతరం గేయంతో ప్రతి పౌరుడిలో దేశభక్తి



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా మహనీయులు బంకిం చంద్ర ఛటర్జీ వందేమాతరం గీతాన్ని రచించారని రెవెన్యూ అదనపు వీరారెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వందేమాతరం సామూహిక గీతాలపన 150వ సంవత్సర కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్న రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి శ్యామ్ సుందర్, కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్, సివిల్ సప్లై అధికారి రోజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/సూర్యాపేట :** 150 వసంతాల వందేమాతర ఉత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో 2000 మంది పౌరులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో నిర్వహించిన భారీ ర్యాలీలో జిల్లా ఎస్పి కె నరసింహ పాల్గొని మాట్లాడారు. వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక 60 ఫీట్ల రోడ్ నుండి వాణిజ్య భవన్ సెంటర్ వరకు వందేమాతరం నినాదాలు, భారత్ మాతాకీ జై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సూర్యాపేట పట్టణంలో వివిధ పాఠశాల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీగా పాల్గొని వాణిజ్య భవన్ సెంటర్‌లో జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, డిఎస్పి ప్రసన్న కుమార్, నరసింహ చారి, సిఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, వందేమాతరం గీతాలాపన కమిటీ సభ్యులు నాగవెల్లి ప్రభాకర్, పర్వతం శ్రీధర్ కుమార్, తోట శ్యామ్‌ప్రసాద్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** భారత జాతీయ గేయమైన వందేమాతరంను రచించి నేటికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం తుంగతుర్తి మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డుపై విద్యార్థులచే జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ బొమ్మ వద్ద సామూహికంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయానంద్, ఎస్ఐ ఆర్ క్రాంతి కుమార్, జిల్లా పరిషత్ తుంగతుర్తి వ్యాయామ ఉపాధ్యాయులు యాకయ్య, శ్రీవిద్యాభారతి పాఠశాల ఉపాధ్యాయులు అంబటి రమేష్, సురేష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మోటకొండూరు :** మోటకొండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు వివిధ గ్రామాలలోని గ్రామ పంచాయితీ కార్యాలయాలలో వందేమాతరం జాతీయ గీతానికి నేటితో 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు.



ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఇందిర, తహసిల్దార్ నాగ దివ్య, ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండల పరిధిలోని చెరుకుపల్లి జెడ్పి హైస్కూల్లో శుక్రవారం భారత జాతీయ గీతం వందేమాతరం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత ఉత్సాహంగా ఈ సామూహిక గేయాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి ఎంపిపిఎస్ హెడ్మాస్టర్ ముడి శ్రీనయ్య, ఉపాధ్యాయులు వెంకటయ్య, లింగయ్య, నాగేశ్వర్‌రావు, సర్ధార్ సింగ్, వేణు, శ్రీనయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడివో కార్యాలయంలో వందేమాతరం గీతం 150 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈకార్యక్రమంలో సినియర్ అసిస్టెంట్ మల్లయ్య, దేవేందర్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/అర్వపల్లి :** భారతీయుల్లో స్వాతంత్ర ఉద్యమంలో వందేమాతర గేయం స్ఫూర్తి నింపిందని ఎస్ఐ సైదులు అన్నారు. ఈ ర్యాలీలో ఏఎస్ఐ రాములు, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ ఝాన్సీ అధికారులతో కలిసి గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు.




**ప్రజాపక్షం/తుర్కపల్లి :** జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం తుర్కపల్లి చౌరస్తాలో పోలీసు సిబ్బంది, ప్రజలతో కలిసి జాతీయగీతం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. నేటి యువత, నేటి సమాజం జాతీయ భక్తి భావం పెంపొందించుకోవాలని పోలీసులు కోరారు.

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** జాతీయ గీతం వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం తుర్కపల్లి చౌరస్తాలో పోలీసు సిబ్బంది, ప్రజలతో కలిసి జాతీయగీతం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. నేటి యువత, నేటి సమాజం జాతీయ భక్తి భావం పెంపొందించుకోవాలని పోలీసులు కోరారు.

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** భారత స్వాతంత్ర ఉద్యమంలో వందేమాతర గేయానిధి ప్రత్యేక స్థానమని జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు కన్నెబోయిన నర్సింహ పేర్కొన్నారు. వందేమాతర గేయాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పట్టణ కేంద్రంలో జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వందేమాతర గేయాలపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ



చైతన్య టెక్నో స్కూల్, మహాత్మా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులతో పాటు మాజీ జెడ్పిటిసి దూదిమెట్ల సత్తయ్య,పంచాయతీ కార్యదర్శి సుభాన్,బిజెపి మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, జనగణమన ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నోముల నాగరాజు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జేరిపోతుల భరత్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/హాలియా:** దేశ స్వాతంత్రోద్యమ సమయంలో వందేమాతర గేయం దేశ ప్రజలను ఏకం చేసిందని,ఉద్యమకారుల్లో ఉత్తేజం నింపిందని హాలియా న్యూ కిడ్స్ పాఠశాల డైరెక్టర్ మనాది రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మనాది శ్రీలత,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.








**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేటలో శుక్రవారం ఉదయం 10గంటలకు ఎన్ఎస్ఎస్ యునిట్1, 2ల ఆధ్వర్యంలో జాతీయ గేయమైన వందేమాతరాన్ని రాహత్ ఖానం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మిర్యాల అనిత, తాటిశెట్టి శ్రీనివాసులు, చిన్నబాబు, రత్నమంజుల, తండు కృష్ణకౌండిన్య, కిషన్, సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

వందేమాతరం గేయానికి 150 ఏండ్లు పూర్తయిన సందర్భంగా రాచకొండ సీపీ ఉత్తర్వులు మేరకు ఉదయం 10గంటలకు సభాష్ విగ్రహం సెంటర్‌లో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామన్నపేట, పోలీస్ సిబ్బంది, తహసీల్దార్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, స్టూడెంట్స్, సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, రామన్నపేట మండల ప్రజలు అందరు కలిసి వందేమాతరం అలాపణ చేయడం జరిగింది.

వందేమాతరం గేయానికి శుక్రవారం 150 ఏండ్లు పూర్తైన సందర్భంగా ఉదయం 10గంటలకు దేశ వ్యాప్తంగా అందరు ఒకే సమయంలో వందేమాతరం గేయం ఆలపించాలని శుక్రవారం ఇంద్రపాలనగరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గేయాలాపన చేశారు. ఇట్టి కార్యక్రమంలో రామన్నపేట మాజీ ఎంపీపీ పూస బాలమణి బాలనరసింహా, స్కూల్ ప్రధానోపాధ్యాయులు కోటగిరి శేఖర్‌ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నందికొండ:** స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన "వందేమాతరం" గేయంశుక్రవారం150 వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల మైదానంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



**ప్రజాపక్షం/చింతలపాలెం :** స్వాతంత్ర్య సమరయోధులకు స్ఫూర్తి ఇచ్చిన మన హృదయాల్లో దేశభక్తిని వెలిగించిన వందేమాతరం గేయానికి నేటితో 150 సంవత్సరాలు పూర్తవుతున్నాయని ఎస్ఐ ఎన్ సందీప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నారపరాజు శ్రీనివాస్, ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ మధుసూదన్ రెడ్డి, ఉషోదయ స్కూల్ కరస్పాండెంట్ చింత్రియాల ఏడుకొండలు, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పులుసు సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం మండల కమిటి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిగ శ్రీను, దేవరకొండ యాదగిరి, బూర్గుల ప్రభాకర్ పాల్గొన్నారు.

## పరిశుభ్రత మనందరి బాధ్యత

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని సూర్యాపేట మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛ సూర్యాపేట కార్యక్రమంలో భాగంగా 10వ వార్డు కుప్పిరెడ్డిగూడెంలో నిర్వహించిన పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత నినాదంతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ జానపాటి నాగయ్య, గౌసుద్దీన్, శివప్రసాద్, శ్వేత, పల్లపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# కోదాడలో పడకేసిన పారిశుద్ధ్యం

### వార్డుల్లో పెరిగిన పిచ్చిమొక్కలు
### రోడ్లపైకి మురుగు నీరు
### దోమలతో జ్వరాల బారిన పట్టణప్రజలు





**ప్రజాపక్షం/ కోదాడ :** తెలంగాణ రాష్ట్ర సరిహద్దు, తెలంగాణ ముఖద్వారం అంటు గొప్పగా చెప్పుకునే కోదాడ పట్టణానికి నిత్యం రాకపోకలు సాగించు ఇతర ప్రాంత వాసులకు, వాహనదారులకు చెత్త కుప్పలు స్వాగతం పలుకుతూ పట్టణ ప్రతిష్ట దెబ్బతీస్తున్నాయి. సరిహద్దు పట్టణమే కాకుండా ఖమ్మం, కృష్ణా, గుంటూరు జిల్లాలకు సరిహద్దు ప్రాంతం కావడంతో నిత్యం వేలాది మంది కోదాడ పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణానికి నలువైపుల గల రహదారుల ఇరువైపుల మొత్తం చెత్త, చెదారంతో దుర్వసనలు వెదజల్లుతున్నాయి. పలు వాహనదారులు, పట్టణ పెద్దలు, సామాజిక కార్యకర్తలు పారిశుధ్య సమస్యపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు, విన్నపాలు చేసినారు. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారులు తీరు ఒక చెవిన విని, మరొక చెవితో వదిలివేస్తున్నాట్లుగా ఉంది. వారి నిర్లక్ష్యంతో కోదాడ పట్టణ పరువు తీస్తున్నారు.

**నిరుపయోగంగా చెత్త డంపింగ్ కేంద్రం....**

రాష్ట్రంలో కోదాడ సుదరమైన పట్టణంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో గత మున్సిపల్ అధికారులు ప్రభుత్వ సహాయ, సహకారాలతో పట్టణానికి దూరంగా చెత్త డంఫింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి చేత్త సేకరణకు వాహనాలను, సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రతి నెల వాహనాల నిర్వహాణకు వేలాది రుపాయల ఆయిల్‌ను అందించారు. కాని ప్రస్తుతం పట్టణ శివారు ప్రదాన రహదారులే డంఫింగ్ యార్డులుగా మారినాయి. చెత్తను మొత్తం రోడ్లపక్కనే డంపింగ్ చేస్తున్నారు. వీరితో పాటు పలు వ్యాపారస్తులు నిత్యం ట్రాక్టర్ల కొద్ది చెత్తను వారి కార్యలయాలలో ఎత్తి తెల్లవారుజామునే రోడ్డ వెడ్డ వేసి చేతులు దులుపుకుంటున్నారు. పారిశుద్యంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**వార్డులు, కాలనీల పరిస్థితి దారుణం....**

పట్టణంలోని పలువార్డులు, కాలనీలలో పారిశుద్యం మరి దారుణంగా తయారైంది. మురుగుకాల్వలు నిండి మురుగు నీరు వీధులలో ప్రవహిస్తు ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోజు విడిచి రోజు వచ్చు చెత్త ట్రాక్టర్ వారానికి ఒకసారి రావడంత ఇండ్లలోని చెత్తను ప్రజలు పరిసరప్రాంత ఖాళీ స్థలాలలో వేస్తున్నారు. దీంతో దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యపై ప్రభావం పడుతుంది. వార్డులలో మున్సిపల్ సి బ్బంది పిచ్చి మొక్కలు తొలగించకపోవడంతో కొన్ని విధుల్లో పల్లె డొంకలను గుర్తు చేస్తున్నాయి. ఇండ్ల మధ్య నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి.

**పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి**

**సయ్యద్ బషీరుద్దీన్ సామాజిక కార్యకర్త**



కోదాడ పట్టణ మున్సిపల్ అధికారులు పారిశుద్యంపై దృష్టి సారించాలి. ప్రతి వార్డులో మురుగునీరు సమస్య పెద్దగా మారింది. లక్ష్మి పురం కాలనీలో మురుగు కాల్వాలు లేక రోడ్లపై వస్తున్నతీరు కన్పిస్తుంది. సరిగ వెలగనీ వీధిదీపాలతో ఇబ్బందులు పడుతున్నారు. చెత్తసేకరణ ప్రతి రోజు నిర్వహించాలి. వార్డులలో సరైన రోడ్లు లేక గుంతలమయంగా మారింది. దీంతో రాత్రివేళ ప్రమాదలకు గురిచేస్తున్నాయి.

---

# ఈ తూము మరమ్మతులకు మోక్షమెప్పుడో!



**ప్రజాపక్షం/ హాలియా:** సాగర్ ఎడమ కాల్వకు ప్రధాన మేజర్లలో ఒకటైన ముదిమాణిక్యం మేజర్‌కు ఉన్న తూము ప్రాంతం దెబ్బతిని ఏడాది కావస్తున్నా మరమ్మతులు చేయడంలో చేస్తున్న జాప్యం తూము ఉనికికే ప్రమాదం తెచ్చి పెట్టేలా ఉంది.నిడమనూరు మండలంలో ప్రధాన మేజర్లలో ముది మాణిక్యం మేజర్ ప్రధానమైనది. ఈమేజర్ పరిధిలో సుమారు 30వేల ఎకరాలు సాగులోకి వస్తుంది. ఇంత పెద్ద మేజర్ కు ప్రమాదం పొంచి ఉంది అని తెలిసిన దానికి శాశ్వత మరమ్మతులేవి చేపట్టకపోవడం రైతులను కలవర పెడుతుంది. గత ఏడాది దెబ్బతిన్న ఈ తూము ప్రాంతానికి తాత్కాలిక మరమ్మతులేవి చేపట్టకపోవడంతో అది మరింత ప్రమాదస్థితికి చేరింది. అయితే ఈ తూము ప్రాంతము నుం డి ప్రధాన రహదారికి ఉన్న బ్రిడ్జి వరకు సైడ్‌వాల్ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. కానీ టెండర్ తగ్గించుకున్న గుత్తేదారు ఇప్పటివరకు దానికి మరమ్మతులు చేయడంలో చేస్తున్న జాప్యం మరింత ప్రమాదానికి కారణం కానుంది. తూము ప్రాంతం అంతా కూడా శిథిలమై పలు ప్రాంతాలలో బీటలు వారింది. ఇది మరింత తీవ్రంగా మారి తూము ప్రాంతం మొత్తం కూడా కూలేందుకు సిద్ధంగా ఉందని చెప్పడానికి ఈ చిత్రమే అందుకు దర్శనం. ప్రస్తుతం మేజర్ ప్రాంతం దెబ్బతిని ప్రమాదంగా మారి పెద్ద నష్టాన్ని ఎత్తిచూపుతుంది. తీరా రబీ సీజన్‌లో నాట్లు వేశాక ఏదైనా ప్రమాదం జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందువలన ఎన్‌ఎస్పి అధికారులు టెండర్ దక్కించుకున్న గుత్తేదారుతో ముది మాణిక్యం తూము ప్రాంతానికి తక్షణ మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఈ మేజర్ పరిధిలో రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై ఎన్‌ఎస్పి డిఈ గోపీనాథ్ వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ టెండర్ దక్కించుకున్న గుత్తేదారుతో మాట్లాడామని త్వరితగతిన పనులు చేపట్టాలని చెప్పినట్లు చెప్పారు. తొందరలోనే దెబ్బతిన్న మేజర్ ప్రాంతానికి మరమ్మతులు చేసేలా చూస్తామన్నారు.




## విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

**ప్రజాపక్షం/మోతె :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ జిల్లా అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏసీలు ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ యన్ శిరీష అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీశక్తి భవన్‌లో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ హామీ పథకం 15విడత ప్రజావేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న సమయాల్లో జరిగే తప్పు ఒప్పులను సరిచూసుకునేందుకు ఆడిట్ నిర్వహిస్తే బాగుంటుందని చెప్పారు. తెలిసి తెలియక జరిగిన పొరపాట్లను సరి చేసుకోవచ్చన్నారు. కావాలని చేసే తప్పులను తప్పుగా పరిగణించవల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆంజనేయులు, అంబుడ్స్ మెన్ డి లచ్చిరాం నాయక్, ఏవిఎంలు వి పద్మనాభం, ఆషారాణి, క్వాలిటి కంట్రోల్ అధికారి టి రామకృష్ణ, ఎస్ఆర్‌పి చెన్నకేశవులు, ఏఇ రంగారావు, ఏపిఎం నగేష్, ఈసి శ్రీహరి, టిఏలు రాము, సురేష్, గ్రామ కార్యదర్శులు రేణుక, సంధ్య పాల్గొన్నారు.

## ఎంపిడిఓకు సన్మానం



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల నూతన ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన పల్లపు ఝాన్సీని రాజ్యాంగ పరిరక్షణ సమితి మండల కోఆర్డినేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీడి వీరస్వామి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువై ప్రజాసమస్యల పరిరక్షణకు పనిచేయాలని కోరారు. ఆయన వెంట సంపత్, బొడ్డు శంకర్ ఉన్నారు.

## వందేమాతరం గీతాలాపన



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** భారతదేశం యొక్క స్థితిగతులను, పరిస్థితులను ప్రజల యొక్క అభిమతాన్ని తెలియపరుస్తూ బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతర గీతం నేటికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఎంఆర్‌ఒ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం లైసెన్స్‌డ్ సర్వేయర్లతో కలిసి గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం యొక్క గొప్పతనం ఈ పాట వల్ల ఎందరో త్యాగధనులు దేశం కోసం పోరాడిన గొప్ప చరిత్ర ఈ పాటకు ఉందని తెలిపారు.

## రూ.5 లక్షల బీమా చెక్కు అందజేత

**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల పరిధిలోని తూతక్క లింగన్నపేట గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త పసుపులేటి కృష్ణ ప్రమాదవశాత్తు మరణించారు. పసుపులేటి కృష్ణ జనసేన పార్టీలో చురుకుగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన తెలుసుకున్న జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, ప్రమాదవశాత్తు మరణించిన క్రియాశీలక కార్యకర్త కుటుంబాలకు రూ.5 లక్షల బీమా చెక్కును పార్టీ కేంద్ర కార్యాలయంలో క్రియాశీలక వాలంటరీ బొగ్గరపు శివకృష్ణ చేతుల మీదుగా శుక్రవారం కార్యకర్త కుటుంబ సభ్యులకు అందజేసి పార్టీ తరపున కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ కుటుంబానికి అండగా నిలిచిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాశం భరత్, కొవ్వూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయ సాధనకై పోరాడుదాం

**ప్రజాపక్షం/మణుగూరు:** అమరవీరుల ఆశయ సాధనకై పోరాడుదాం అని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. నవంబర్ 1 నుండి 9 వరకు జరుగుతున్న అమరవీరుల సంస్మరణ సభల వారోత్సవాల్లో భాగంగా మణుగూరు లోని స్థానిక పార్టీ కార్యాలయంలో బత్తుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో దోపిడీ, పీడనలు లేని సమ సమాజం కావాలని, ధనిక, పేద బేధం లేకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని కలలు కని అందుకోసం తమ జీవితాలను త్యాగం చేసి ఎంతోమంది అమరవీరులయ్యారని అన్నారు. అమరులు ఏ ఆశయం కోసం అయితే పోరాడి అమరులయ్యారో ఆ ఆశయ సాధన కోసం మనమంతా పోరాడాలని అన్నారు.

# పరిమితికి మించిన ప్రయాణికుల వల్లే ప్రమాదాలు

**-ఆర్ఎంకు అద్దె బస్సుల యజమానుల వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బస్సులలో పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అద్దె బస్సు యజమానులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఖమ్మం ఆర్టిసి రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడం వల్ల పరిమితికి మించి బస్సులలో ప్రయాణిస్తున్నారని దీని వల్ల మైలేజీ రాకపోగా డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని అధిక బరువుతో టైర్లు పగిలిపోతున్నాయని యజమానులు తెలిపారు. నష్టాలను, కష్టాలను బరించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నామని దీనికి తోడు రోడ్లు సరిగ్గా లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుందని తెలిపారు. పరిమితికి మించిన ప్రయాణికులు ఉండడం వల్ల బీమా సంస్థలు కూడా పరిహారం ఇవ్వడం లేదని వినతి పత్రంలో ప్రైవేటు బస్సు యజమానులు పేర్కొన్నారు.పలుమార్లు ఈ విషయమై ఆర్టిసి యజమాన్యం దృష్టికి తీసుకు వచ్చిన ఫలితం లేకపోయిందని వారు తెలిపారు. పరిమితికి మించకుండా ప్రయాణికులను ఎక్కించే పద్ధతిని అమలు చేయాలని లేని పక్షంలో ఈనెల 24 నుండి ఆర్టిసి అద్దె బస్సులను ఇక నడపలేమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైర్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నకిరికంటి సత్యంబాబు, కార్యదర్శి పైడిపల్లి రవికుమార్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు సూరంపల్లి నరేందర్, నల్లమోతు రమేష్, పి. సుబ్బారావు, వనమా శ్రీనివాసరావు, ఏవిరావు, కొండబాబు, శ్రీనివాస ప్రసాద్, నామ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు ఉత్సాహంగా జోనల్ స్పోర్ట్స్ మీట్

**హోరాహోరీగా పోటీపడ్డ క్రీడాకారులు**



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రెండో రోజు జోనల్ మీట్ క్రీడలు అత్యంత ఉత్సాహభరితంగా జరిగాయి. అండర్14 విభాగంలో 200 మీటర్స్ పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఎస్.భార్గవి(వైరా), ఏ.ఏంజెల్(టేకులపల్లి), పి.స్రవంతి(కల్లూరు) సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఎస్.భార్గవి వైరా పి.స్రవంతి(కల్లూరు), జె.కావ్యశ్రీ(వైరా), 600 మీటర్స్ పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా పి.స్రవంతి(కల్లూరు), సిహెచ్.మహాలక్ష్మి( ఇల్లందు), ఏ.లక్ష్మీ త్రివేణి(వైరా) సాధించారు. షాట్‌పుట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా డి.భవ్యశ్రీ(అడవిమల్లెల), ఎస్.భార్గవి(వైరా), వి.మేఘవర్షిత(కూసుమంచి) సాధించారు. లాంగ్ జంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా ఏ.లక్ష్మి త్రివేణి(వైరా), ఎస్.భార్గవి(వైరా), కె.నవ్య(ఇల్లందు)లు సాధించారు. చదరంగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా షణ్ముఖ ఎర్రుపాలెం, కె.వర్షిత ఇల్లందు, జి.హర్షిత అడవిమల్లెల సాధించారు. క్యారమ్స్ డబుల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు వరుసగా పి.సుకన్య, స్వర్ణమనీష్ కూసుమంచి, ఎస్.వింద్య, ఎం.ప్రణిత ఎర్రుపాలెం సాధించారు. అండర్17 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టి.రేష్మా(వైరా), సిహెచ్.వెన్నెల ఇల్లందు, జి.మంజుని కల్లూరు సాధించారు. 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టి.రేష్మా వైరా, సిహెచ్.వెన్నెల ఇల్లందు, ఎం.హర్షిని ఇల్లందు, 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా కైలా సాయిశ్రీ ముల్కలపల్లి, టి.మానస ఇల్లందు, పి.హర్షిత మధిర సాధించారు. 3000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా అఖిల సాయిశ్రీ ములకలపల్లి, మానస ఇల్లందు, ఏ.సాక్షిత ములకలపల్లి సాధించారు. షాట్‌పుట్‌లో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా టి.ఉమారాణి అడవిమల్లెల, డి.స్వాతి కూసుమంచి, ఏ.సంజన ఎర్రుపాలెం సాధించారు. లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా సిహెచ్.వెన్నెల ఇల్లందు, టి.రేష్మా వైరా, ఎం.హర్షిని ఇల్లందు సాధించారు. చదరంగంలో ప్రథమ, ద్వితీయ జి.హర్షిత అడవిమల్లెల, సౌమ్యశ్రీ నేలకొండపల్లి బహుమతులు వరుసగా సాధించారు. క్యారమ్స్ డబుల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు వరుసగా డి.హర్షిత, సాత్విక కల్లూరు భద్రాచలం సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి ఎస్.విద్యారాణి, వైరా గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత, ఇతర గురుకులాల ప్రిన్సిపాల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు కొరత

**ఆందోళనలో రైతులు**



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పలు కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు కొరతతో గత నాలుగు రోజుల నుంచి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుపుతున్నారు. మండల పరిధిలోని కల్లూరు, చెన్నూరు సొసైటీలలో పరిధిలో కొరత వలన కొనుగోలు మందగించాయని రైతులు తెలుపుతున్నారు. మండల పరిధిలోని 33,400 ఎకరాలలో వరి పంట సాగు చేస్తుండగా ఈ సంవత్సరం తుఫాను ప్రభావం ఎరువుల కొరత, గోనె సంచులు కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని జిడిపి పల్లి లో రైతులు గోని సంచుల కోసం రోడ్డు ఎక్కి ఆందోళన చేశారు. కల్లూరు సొసైటీ, చెన్నూరు సొసైటీ, లలో గోని సంచులు కొరతతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తేమశాతం అనుకూలంగా వచ్చిన బస్తాలలో కాంట వేసేందుకు రైతుల సిద్ధం చేయగా సంచులు లేనందున అమ్మకాలు ఆలస్యంగా జరుగుతున్నాయని రైతులు తెలుపుతున్నారు. తుఫాను ప్రభావం ఎరువుల కొరత ఆపై ఎండి తెగులు ఆకు తెగులు చీడపీడలతో ఈ సంవత్సరం దిగుబడి అంతంత మాత్రమేనని ఇదే సమయంలో గన్ని సంచుల కొరతతో ఇదే అదునుగా నేల బురదగా ఉండటంతో కోత యంత్రం వారు అదనపు ధరలను పెంచేశారు. రైతుకు అన్నీ కష్టాలేనని రైతులు వాపోతున్నారు. ఈ సంవత్సరం పెట్టుబడి వచ్చేనా అంటూ రైతులు దిగాలు పడుతున్నారు. మండల పరిధిలోని జిడిపి పల్లి, వాచ్యనాయక తండా, చంద్రుపట్ల, రఘునాథగూడెం, ఎర్రబోయినపల్లి, కల్లూరు, లింగాల, చెన్నూరు తదితర గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల రైతులు తెలుపుతున్నారు. త్వరగా త్వరితగతిన రైతులకు గన్ని సంచులు అందించి ఆదుకోవాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

# స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం నినాదం కీలకమైంది



**ప్రజాపక్షం/వైరాః** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం నినాదం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేయడంలో చాలా గొప్ప ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందని వైరా పట్టణంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీనజ్యోతి తెలిపారు. వందేమాతరం గేయాన్ని బకిన్‌చంద్ర చటర్జీ రచించి 150 సంవత్సరాలు సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల ప్రకారం శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వందేమాతర గేయాన్ని టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థిని, విద్యార్థులు అందరూ ప్రభుత్వం వారి ఆదేశాలకు అనుకూలంగా ఉదయం 10గంటలకు ఆలపించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చరిత్ర అధ్యాపకురాలు రజియా సుల్తానా మేడం రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో ప్రజలందరిని ఐక్యం చేయడంలో వందేమాతరం నినాదం చాలా ప్రేరణగా నిలిచిందని తెలిపారు. బ్రిటీష్ వారు భారతీయులు ఐక్యతను దెబ్బతీయడానికి కుట్రపూరితంగా బెంగాల్ విభజన చేస్తున్న సందర్భంలో హిందూ, ముస్లింలు అందరూ కలిసి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా వందేమాతరం నినాదంతో దేశవ్యాప్త ఉద్యమం చేశారని తెలిపారు. 1950లో భారత రాజ్యాంగ సభ వందేమాతారాన్ని జనగణమన గీతంతో పాటు సమాన గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. భారతదేశ పౌరులందరూ వందేమాతర గీతాన్ని గౌరవించాలని కోరారు.

# భారతావనిలో స్ఫూర్తి నింపిన వందేమాతరం



**ప్రజాపక్షం/ తల్లాడ :** వందేమాతరం గీతం యావత్ భారతదేశంలో స్ఫూర్తిని నింపిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏనుగు సురేష్ బాబు తెలిపారు. 1975 నవంబర్ ఏడున బంకించంద్ర చటర్జీ రచించిన ఆనంద మఠ్ నవలలో ఈ గీతాన్ని తొలిసారి ప్రచురించడం జరిగిందన్నారు. ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించడంలోనూ, దేశ ప్రజల్లో ఐక్యత పెంపొందించడంలోనూ విశేషంగా దోహదపడిందన్నారు. వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తల్లాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వందేమాతర గీతాన్ని శుక్రవారం ఆలపించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ 150 ఏళ్ల వందేమాతర గీతం ఇప్పటికీ ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. విశేష అర్థాలు, విశిష్ట సారాంశంతో కూడిన ఈ గీతం నిత్య నూతనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ ఈవో కృష్ణారావు, సిబ్బంది మధుకర్‌రెడ్డి, స్టాలిన్, ఖాజామోహినుద్దీన్, పెద్ద సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు సామినేని రామారావు సంస్మరణ సభ

**-హాజరు కానున్న రాఘవులు, తమ్మినేని, బాగం**



**ప్రజాపక్షం/ చింతకాని :** సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు, పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ ఇటీవల హత్యకు గురైన సామినేని రామారావు సంస్మరణ సభ శనివారం ఉదయం తొమ్మిది గంటలకు పాతర్లపాడు గ్రామంలో జరుగుతుందని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, పోతినేని సుదర్శన్ లతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని గోపాలరావు తెలిపారు.

# రాష్ట్ర కళా ఉత్సవ్‌లో సత్తా చాటిన శ్రీ వైష్ణవి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర కళా ఉత్సవ్ 2025 లో గిన్నారపు సేవిత శ్రీ వైష్ణవి సత్తా చాటింది. భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ నవభారత్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న శ్రీవైష్ణవి రాష్ట్ర కళా ఉత్సవ్ పాటల పోటీలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన శ్రీవైష్ణవి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం పొందడం అభినందనీయం. పిడిలు నవీన్ నిక్లోస్, రాధారెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికను, ధృవపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవైష్ణవి తల్లిదండ్రులు నాగేంధర్, అంబిక లు మాట్లాడుతూ మా కుమార్తె చదువుతో పాటు పాటలు పాడటంలో కూడా ప్రతిభ కనబరుస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. శ్రీ వైష్ణవికి నవభారత్ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ఫోటోలు ఉన్నాయి

# పోలీసుశాఖ ఆధ్వర్యంలో 'వందేమాతరం'

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జాతీయ గేయం 'వందేమాతరం ' నికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సామూహిక ఆలపన కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీసు పెరెడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించారు. పోలీసు కమిషనర్ సునిల్‌దత్ నేతృత్వంలో జరిగిన ఈ గీతాలాపనలో కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, డిసిపిలు, ఏసిపిలు, ఏఆర్ సిబ్బంది పాల్గొని వందేమాతరం ఆలపించారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసి స్ఫూర్తినిచ్చేందుకు వందేమాతరం గీతం ఎంతో దోహదం చేసిందని సిపి పేర్కొన్నారు. ఏడాదిపాటు ఈ వేడుకలు దేశవ్యాప్తంగా జరుగనున్నయని ఆయన తెలిపారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్‌పరిధిలోని గోపాలపురం లోని ఒక దాబా వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని సిఐ భానుప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నామన్నారు. స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి అనంతరం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ అస్పత్రి మార్చురికి తరలించినట్లు తెలిపారు. మృతుడు సుమారు 22 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, గళ్ల టీషర్టు ధరించి ఉన్నాడని, అతని వివరాలు తెలిసిన వారు ఎవరైన ఉంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో కాని సెల్ నెంబర్లు 8712659122, 8712659120, 8712659119 లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# మూడు విద్యుత్ స్తంభాల వైరు చోరీ

**ప్రజాపక్షం/కామేపల్లి :** మండలంలోని రామకృష్ణాపురం గ్రామ సమీపంలో పంట చేనులో ఉన్న వ్యవసాయ విద్యుత్ స్తంభాల వైర్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన మండలంలోని రామకృష్ణాపురం గ్రామ సమీపంలోని ఆ గ్రామానికి చెందిన రైతు ఆంగోత్ లక్ష్మ ణ్ పంట చేనులో పత్తి మిర్చి తోట వేశాడు. అతని వ్యవసాయ బాయి నుండి పంట చేనుకు నీరు పెట్టడానికి విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన పోల్స్‌పై ఉన్న తీగను గురువారం రాత్రి దొంగలు దొంగిలించారు. శుక్రవారం ఉదయం పంట చేనుకు వెళ్లిన రైతు లక్ష్మ ణ్ చోరీ జరిగిన విషయాన్ని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. దీనిపై విచారణ జరిపి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఏఈ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు.